క్లుప్తంగా

ఫ్యామిలీ డాక్టర్‌తో ప్రజల చెంతకే వైద్యం



గుల్లేపల్లిలో వైద్య సేవలందిస్తున్న వైద్యాధికారి ధరణి

కె.కోటపాడు : ఫ్యామిలీ డాక్టర్‌తో ప్రజల చెంతకే వైద్యసేవలు అందుతున్నాయని వైద్యాధికారి డాక్టర్ ధరణి అన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా గురువారం గుల్లేపల్లిలో వైద్య సేవల్ని అందించారు. 127 మందిని ఓపీ ద్వారా పరీక్షించి, అవసరమైన మందులను అందించారు. ఇంటి నుంచి కదల్లేని పరిస్థితిలో ఉన్న ఆరుగురు రోగుల్ని పరీక్షించి, వైద్యం చేశారు. వారిలో భరోసా నింపారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ డీఎస్ఎన్ రాజు, హెచ్‌వీ అచ్చియ్యమ్మ, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం



డి.అగ్రహారంలో పోషకాహారంపై వివరిస్తున్న వెంకటలక్ష్మి

కె.కోటపాడు: పిల్లల్లో వయసుకు తగ్గ ఎదుగుదల ఉండేందుకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలని అంగన్‌వాడీ కార్యకర్త వి.వెంకటలక్ష్మి అన్నారు. డి.అగ్రహారం అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు పోషకాహార ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. మార్కెట్‌లో తక్కువ ధరకే లభ్యమయ్యే వస్తువులతో పౌష్టికాహారాన్ని ఎలా తయారు చేసుకోవచ్చో వివరించారు. ముఖ్యంగా పప్పుదినుసులు, ఆకుకూరలతో కూడిన ఆహారం, పాలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రమాదాల నియంత్రణపై అవగాహన



విద్యార్థులకు అగ్ని ప్రమాదాల నియంత్రణపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

మాడుగుల: స్థానిక అగ్నిమాపక కేంద్రం సిబ్బంది ఓ ప్రైవేట్ స్కూల్లో విద్యార్థులకు, అగ్ని, నీరు, గ్యాస్ తదితర ప్రమాదాలు జరగకుండా నియంత్రణ చర్యలు, ప్రమాద సమయంలో తీసుకోవాల్సిన మెళకువలపై డెమో నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో ఫైర్ అధికారి రాజేశ్వరరావు, లీడింగ్ ఫైర్‌మన్ శ్రీను, ఫైర్‌మన్‌లు మణికుమార్, వరహాలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్ తీసుకున్న విద్యార్థులతో సృజనవాణి సభ్యులు

రోలుగుంట: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్) పరీక్షకు హాజరయ్యే 23 మంది విద్యార్థులకు స్కూల్ సిబ్బంది కోచింగ్ ఇస్తున్నారు. విషయం తెలుసుకున్న బుచ్చియ్యపేట మండలం వడ్డాదికి చెందిన సృజనవాణి స్వచ్ఛంద సంస్థ సభ్యులు ఈ విద్యార్థులకు అవసరమైన స్టడీ మెటీరియల్‌ను గురువారం పంపిణీ చేశారు. విద్యార్థుల తరఫున స్కూల్ హెచ్ఎం వరప్రసాదరావు కృతజ్ఞతలు తెలిపారు.

వలస కార్మికులకు వసతి కల్పించాలి

అచ్యుతాపురం(అనకాపల్లి): వలస కార్మికులకు సరైన వసతులతో కూడిన నివాసాలను కల్పించాలని సీఐటీయూ నాయకులు ఆర్.శంకర్‌రావు, ఆర్.రాము జిల్లా కార్మిక శాఖ అధికారుల్ని కోరారు. ఈ మేరకు గురువారం వినతి పత్రం సమర్పించారు. వలస కార్మికులకు ఇస్తున్న షెడ్‌లలో మౌలిక సదుపాయాలు ఉండడం లేదని, ఇరుకైన గదుల్లో మగ్గిపోతున్నారని తెలిపారు. వలస కార్మికుల శ్రమను దోచుకుంటున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

భారీ వర్షం.. రైతుల్లో హర్షం

పల్లపు భూముల్లో చేరిన వర్షపు నీరు



వీరనారాయణంలో పంట భూముల్లో చేరిన నీరు



వర్షాలకు వీటీ పాలెంలో చెరువులో చేరిన నీరు



బుచ్చెయ్యపేట వరి పొలాల్లో చేరిన వర్షం నీరు



వర్షం నీటితో నిండుగా ప్రవహిస్తున్న గుర్రపుగెడ్డ

మాడుగుల రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ప్రభావంతో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పల్లపు భూముల్లో నీరు చేరింది. ఆశించిన స్థాయిలో నీరు లేకపోవడం, దీనికి తోడు గత వారం రోజులుగా కాస్తున్న ఎండలకు వరి నాట్లు ఎండిపోతున్న తరుణంలో తాజాగా కురిసిన వర్షాలు వరి నాట్లకు జీవం పోశాయి. వీరనారాయణం, జంపెన, ముకుందపురం, వీజే పురం తదితర గ్రామాల్లోని పల్లపు భూముల్లో వరి నాట్లకు ఈ వర్షం చాలా ఉపయోగకరంగా ఉంటుందని రైతులు చెప్తున్నారు. గ్రామాల్లోని పలు సాగునీటి చెరువులు కూడా వర్షపు నీరు చేరి కళకళలాడుతున్నాయి.

బుచ్చెయ్యపేట: వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో పంట చేలు తేరుకున్నాయి. నెల రోజులుగా వర్షాల్లేక వడలిపోతున్న పలు రకాల పంటలకు తాజా వర్షాలు ఊపిరి పోశాయి. నీరు లేక ఎండిపోయిన చెరువులు, బావుల్లో పుష్కలంగా నీరు చేరుతోంది. నదులు, గెడ్డలు, వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.ఆగస్టు నెలలో 180 మి.మీ. సాధారణ వర్షపాతానికిగాను 28 మి.మీ. మాత్రమే కురిసింది. గడచిన వారం రోజుల్లో 86 మి.మీ. వరకు వర్షపాతం నమోదయినట్లు అధికారులు తెలిపారు. పుష్కలంగా కురుస్తున్న వర్షాలతో పంటలకు తగినంత సాగునీరు అందుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. బుచ్చెయ్యపేట మండలంలో ఉన్న పెద్దేరు, తాచేరు, బొడ్డేరు తదితర నదులు నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఖరీఫ్ వరి పంటలతో పాటు చెరకు, మినప, పెసర, గంటి, చోడి, కందులు, పలు రకాల కూరగాయ పంటలు, సరుగుడు, యూకలిప్టస్, జీడిమామిడి, టేకు, కొబ్బరి తోటలకు ఈ వర్షాలు మేలు చేకూరుస్తాయని వ్యవసాయ అధికారులు చెప్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో మరో నెల రోజుల వరకు పంటలకు నీటి కొరత ఉండదని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వానికి దాతల సాయం తోడైతే మరింత అభివృద్ధి

- స్థల దాతలకు గుర్తుగా విగ్రహాల ఏర్పాటు హర్షణీయం
- ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్



పీహెచ్‌సీకి స్థలాన్ని ఇచ్చిన దాత యరకయ్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గణేష్

నాతవరం: ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు దాతలు సహకారం కూడా తోడైతే మరింత అభివృద్ధి జరుగుతుందని ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ అన్నారు. 1960లో మండల కేంద్రంలో పీహెచ్‌సీకి మూడెకరాల స్థలాన్ని ఇచ్చిన దివంగత నేత అంకంరెడ్డి యరకయ్య, సచివాలయం ఆర్బీకే కేంద్రం నిర్మాణానికి 2019లో 30 సెంట్ల స్థలాన్నిచ్చిన దివంగత నేత అంకంరెడ్డి లత్సన్నలకు గుర్తుగా ఏర్పాటు చేసిన విగ్రహాలను వారి కుటుంబ సభ్యులు, రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక విభాగం క్రియేటివ్ హెడ్ లోకారపు జోగినాయుడుతో కలిసి గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పీహెచ్‌సీకి ఇచ్చిన స్థలంలో రూ.2 కోట్లతో అదనపు భవన నిర్మాణం జరిపామన్నారు. ఆర్బీకేకి ఇచ్చిన స్థలంలో రూ.65 లక్షలతో సచివాలయ నూతన భవనం, ఆర్బీకే భవనం నిర్మించినట్లు తెలిపారు. మండల కేంద్రంలో విలువైన స్థలాన్ని ప్రభుత్వ నిర్మాణాలకు దానం చేసిన అంకంరెడ్డి కుటుంబీకుల్ని అభినందించారు. వారి జ్ఞాపకార్థం విగ్రహాల ఏర్పాటు హర్షణీయమన్నారు. అనంతరం సచివాలయం వద్ద కొత్త పింఛన్లు మంజూరైన 35 మందికి ఎమ్మెల్యే చేతుల మీదుగా పింఛన్ నగదు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, వైస్ ఎంపీపీలు పైల సునీల్, మైనం శ్రీనాగగోపి, ఎంపీడీవో హనుమంతరావు, నాతవరం సర్పంచ్ గొలగాని రాణి, ఉప సర్పంచ్ కరక అప్పలరాజు, ఎంపీటీసీ సభ్యులు కరక రేణుక, చెక్కా జోగిరాజు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత మృతి



రాజునాయుడు (ఫైల్)

రావికమతం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మూడు దశాబ్దాల పాటు వివిధ పదవులను చేపట్టిన గ్రట్టిడ్డి రాజునాయుడు(85) గురువారం మృతి చెందారు. దొండపూడి గ్రామ సర్పంచ్‌గా ఆయన 1964 నుంచి 89 వరకూ ఏకంగా 25 ఏళ్లపాటు కొనసాగారు. 1999లో కళ్యాణపులోవ రిజర్వాయర్ ఆయకట్టు చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. అప్పట్లో కాంగ్రెస్ పార్టీకి స్థానికంగా ముఖ్య నాయకుడిగా వ్యవహరించారు. వృద్ధాప్య సంబంధ వ్యాధులతో ఆయన మరణించారు. శుక్రవారం ఉదయం దొండపూడిలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు ఆయన కుమారుడు జీపీఎస్ నాయుడు తెలిపారు.

వర్షానికి కూలిన పాఠశాల ప్రహరీ గోడ



కూలిన దేవరాపల్లి ఎంపీపీ స్కూల్ ప్రహరీ గోడ

దేవరాపల్లి: స్థానిక పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న ప్రాథమిక పాఠశాల (మెయిన్ స్కూల్) ప్రహరీ గోడలో కొంత భాగం గురువారం తెల్లవారుజామున కూలిపోయింది. బుధవారం కురిసిన భారీ వర్షం ధాటికి పాఠశాల వెనుక భాగంలో దేవి తల్లి ఆలయానికి వెళ్లే మార్గం వైపు సుమారు 15 మీటర్ల మేర గోడ నేలకూలింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేక పోవడంతో ప్రమాదం తప్పింది. ప్రహరీని ఆనుకుని నిలిపిన ద్విచక్ర వాహనం ధ్వంసమైంది. ఉన్నతాధికారులు స్పందించి కూలిన ప్రహరీ గోడను పునర్నిర్మించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. ప్రహరీ కూలిన ప్రాంతాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పోతల శ్రీనివాసనాయుడు, ఉపాధ్యాయులు అవుగడ్డ కృష్ణ స్వామినాయుడు, రెడ్డి జగన్ మనోహర్ పరిశీలించారు.

స్వచ్ఛ భారత్‌పై విద్యార్థులకు పోటీలు



చిత్రలేఖనం పోటీలో పాల్గొన్న విద్యార్థులు

చోడవరం రూరల్: స్వచ్ఛ పక్వాడా పథకంలో భాగంగా మండలంలోని గవరవరం జెడ్పీ హై స్కూల్ విద్యార్థులకు గురువారం పలు రకాల పోటీలు నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.జె.సుందర్‌సింగ్ నేతృత్వంలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ పోటీలతోపాటు, స్వచ్ఛ భారత్ అంశంపై స్లోగన్ పోటీలు జరిపారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని, తమ ప్రతిభను ప్రదర్శించారు.

ఈ-పంట నమోదుపై అవగాహన కల్పించాలి



ఈ-పంట నమోదును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి మోహనరావు

మునగపాక : ఈ-పంట నమోదుపై రైతులు దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి మోహనరావు కోరారు. నాగులాపల్లి, ఉమ్మలాడ గ్రామాల్లో ఆయన గురువారం పర్యటించారు. ఆయా గ్రామాల్లో జరుగుతున్న ఈ -పంట నమోదుపై అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ-పంట నమోదు వల్ల రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించాలని స్థానిక అధికారులకు సూచనలు చేశారు. మండల వ్యాప్తంగా వరి సాగు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆర్బీకేల ద్వారా రైతులకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి సీహెచ్.జ్యోత్స్నకుమారి, వీఏఏ సత్య రవిరాజ్ పాల్గొన్నారు.

త్వరలో ఉచిత వైద్య శిబిరాలు



మాట్లాడుతున్న డాక్టర్ తాడి ప్రకాష్ రత్నం

పాయకరావుపేట : నియోజకవర్గంలో త్వరలో పేదలకు ఉచితంగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని విశాఖ స్టీల్ ప్లాంట్ వైద్యుడు డాక్టర్ తాడి ప్రకాష్ రత్నం తెలిపారు. పట్టణంలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. తాను విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లో అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌గా వైద్య సేవలు అందిస్తున్నానన్నారు. తాను వైఎస్సార్‌సీపీ అభిమానినని పార్టీ గెలుపుకోసం, అభివృద్ధికి కృషి చేస్తున్నానన్నారు. పార్టీ అధిష్టానం ఆదేశిస్తే నియోజకవర్గంలో కీలకమైన బాధ్యతలు చేపట్టి, ప్రజలకు సేవ చేసుకోవడం జరుగుతుందన్నారు.

టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్‌పై మహిళలకు శిక్షణ



శిక్షణ తరగతుల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న నిర్వాహకులు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని హరిపాలెం-అందలాపల్లిలో మహిళలకు టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్‌లో 60 రోజుల శిక్షణను గురువారం ప్రారంభించారు. నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా అనకాపల్లి జిల్లా సత్యసాయి సేవా సంస్థలు ఈ కార్యక్రమానికి రూపకల్పన చేశారు. సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు వై.కృష్ణంరాజు, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ కో-ఆర్డినేటర్ ఎ.రాజశేఖర్, హరిపాలెం గ్రామ సర్పంచ్ భర్త ఎం.సూర్యనారాయణ, కె.ఎం నాయుడు, కె.ఆదీశ్వరరావు, ఎస్.చంద్రశేఖర్, పాండురంగారావు, శ్రీను, బుద్ధ సత్యరామ్ పాల్గొన్నారు.

రూ.1.52 కోట్లతో అభివృద్ధి పనులు



అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి అమర్‌నాథ్

అనకాపల్లిటౌన్ : అభివృద్ధి, సంక్షేమం రెండు నేత్రాలుగా భావించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని, దశల వారీగా నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. పట్టణంలోని గాంధీనగరంలో సీసీరోడ్డు, డ్రైనేజీ, చోడవరం రహదారి అభివృద్ధి పనులకు గురువారం మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా కేంద్రానికి కావాలసిన అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. మొదటి దశలో ప్రధాన రహదారి విస్తరణ పనులు జరుగుతున్నా యన్నారు. నెహ్రూచౌక్ నుంచి గుండాల జంక్షన్ వరకూ తారురోడ్డు పనులు ప్రారంభిస్తున్నట్టు చెప్పారు. అభివృద్ధిలో స్థానిక ప్రజలు ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. సీసీ రోడ్డు, డ్రైనేజీ, రహదారి అభివృద్ధి పనులు రూ.కోటి 52లక్షల నిధులతో చేపడుతున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, 83వ వార్డు ఇన్‌ఛార్జి జాజుల రమేష్, జీవీఎంసీ కమిషనర్ వెంకటరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా మరిడిమాంబ అమ్మవారి పండగ



మరిడిమాంబ అమ్మవారిని దర్శించుకున్న మంత్రి అమర్‌నాథ్

మునగపాక : మండలంలోని నాగులాపల్లి, తిమ్మరాజుపేట గ్రామాల్లో మరిడిమాంబ అమ్మవారి పండగలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి ఆయా గ్రామాల్లో అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలి వచ్చారు. నాగులాపల్లిలోని అమ్మవారిని ఐటీ శాఖామంత్రి గుడివాడ అమర్‌నాథ్ దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు మంత్రి అమర్‌నాథ్‌ను శాలువాలతో సత్కరించారు. ఆయన వెంట మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు దొడ్డి వరహా సత్యనారాయణ, పాలసంఘ అధ్యక్షుడు దొడ్డి బుజ్జి, మాజీ సర్పంచ్ యల్లపు భాస్కరరావు, ఉప సర్పంచ్ దానకృష్ణ, వైఎస్సార్‌సీపీ నేతలు ఇల్లా నాగేశ్వరరావు, నరాలశెట్టి సూర్యనారాయణ, దుబాసి నాయుడు, మొల్లేటి శంకర్, సిరసపల్లి ఎంపీటీసీ మద్దాల వీరునాయుడు పాల్గొన్నారు.

పండగలతో గ్రామాల్లో ఐక్యత

కృష్ణాష్టమి వేడుకల్లో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



గుల్లేపల్లిలో కృష్ణాలయంలో పూజల్లో పాల్గొన్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

కె.కోటపాడు: పండగల నిర్వహణలో గ్రామస్తుల మధ్య ఐక్యత, సత్సంబంధాలు పెరుగుతాయని డిప్యూటీ సీఎం, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. మండలంలోని గుల్లేపల్లి గ్రామంలో గురువారం నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. గ్రామస్తులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఏటా కృష్ణాష్టమి వేడుకల్లో తనను భాగస్వామిని చేయడం సంతోషంగా ఉందన్నారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన అన్నసమారాధన కార్యక్రమానికి ఆర్థిక సాయం అందించారు.

కమ్యూనిటీ భవనానికి రూ.5 లక్షలు

గుల్లేపల్లి శ్రీకృష్ణాలయం వద్ద కమ్యూనిటీ భవనం నిర్మాణానికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు రూ.5 లక్షల నిధులను మంజూరు చేశారు. యాదవ సంఘం సభ్యుల కోరిక మేరకు వెంటనే నిధులను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అడిగిన వెంటనే నిధులు మంజూరు చేసిన మంత్రికి సర్పంచ్ బండారు దేముళ్లు, యాదవ సంఘం సభ్యులు దుశ్శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, యాదవ సంఘం అధ్యక్షుడు దొప్ప ఎర్రునాయుడు, ఉప సర్పంచ్ బోను గంగునాయుడు, సంబారు అప్పారావు, బొడ్డాన రమణ, గేదెల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



రాధాకృష్ణ యూత్ ఆధ్వర్యంలో కేజే పురంలో కృష్ణాష్టమి వేడుకలు



రామాలయంలో కృష్ణాష్టమి వేడుకల్లో భక్తులు



శ్రీకృష్ణుని సన్నిధిలో ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

మాడుగుల రూరల్: శ్రీకృష్ణాష్టమి సందర్భంగా కేజే పురం రామాలయంలో శ్రీరామ భక్తజన బృందం, స్థానిక భక్తుల ఆధ్వర్యంలో బుధవారం రాత్రి వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. రాత్రి 8 గంటల నుంచి భజన, ఉయ్యాల కార్యక్రమాలను నిర్వహించారు.

స్థానిక రాధాకృష్ణ యూత్ ఆధ్వర్యంలో కళావేదిక మీద రాధాకృష్ణుల చిత్రపటానికి పూలమాల వేసి, పూజలు చేశారు. డి.గొటివాడ, జాలంపల్లి, జి.అగ్రహారం, సాగరం కాలనీ తదితర గ్రామాల్లో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని అత్యంత వేడుకగా నిర్వహించారు.

బుచ్చెయ్యపేట: మండలంలోని ఎల్‌బీ పురంలో కృష్ణాష్టమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, జెడ్పీటీసీ దొండా రాంబాబు, పార్టీ మండల అధ్యక్షుడు కె.అచ్చింనాయుడు, వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు, సర్పంచ్ తమరాన శ్రీను తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు జరిపారు. ఉదయం నుండి రాత్రి వరకు ఆలయంలో ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నసంతర్పణ జరిపారు. రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పరిసర గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

మాకవరపాలెం: కృష్ణాష్టమి వేడుకలను మండలంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని బీసీ కాలనీలో ఉన్న కృష్ణుడి ఆలయం వద్ద గురువారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి, అన్నప్రసాదం స్వీకరించారు. రాచపల్లి, గిడుతూరు తదితర గ్రామాల్లోనూ కృష్ణాష్టమి వేడుకలను వైభవంగా నిర్వహించారు.

రోలుగుంట: మండలంలోని గ్రామాల్లో బుధ, గురువారాల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకల్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. ప్రధానంగా యాదవ కుటుంబాలు తమ ఇలవేల్పు అయిన కృష్ణుడి జన్మాష్టమిని వేడుకగా చేసుకున్నారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా వడ్డిలో ఉన్న వేణుగోపాలస్వామిని అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి, దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకుడు గజ్జి సాంబశివరావు దంపతులు భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కొండపాలెం, రోలుగుంట, కొమరవోలు తదతర గ్రామాల్లో యాదవ కుటుంబాలు ఘనంగా కృష్ణాష్టమిని జరిపి, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఆర్బీకేల ద్వారా రైతులకు విస్తృత సేవలు



ఉద్యాన శాఖ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ సత్యవతి

తుమ్మపాల : రైతే రాజు అన్న మాటను నిజం చేస్తూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అన్ని గ్రామాల్లో రైతులకు అందుబాటులో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారని ఎంపీ బి.వి.సత్యవతి అన్నారు. పట్టణంలో వివేకానంద ఫంక్షన్ హాలులో ఉద్యానశాఖ ఆధ్వర్యంలో గురువారం హార్టికల్చర్ సైంటిస్టులు, ఎఫ్‌పీవో సభ్యులు, అధికారుల అవగాహన సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అన్ని సేవలు అందించేలా ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. రైతు భరోసా ద్వారా ప్రతి రైతుకు ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. వ్యవసాయంలో వర్షభావ పరిస్థితులు ఏర్పడినప్పుడు ప్రత్యామ్నాయ పంటలు, ఉద్యాన పంటల సాగు వంటి అంశాలపై సదస్సులో చర్చించారు. ఉద్యాన శాఖ అధికారి ప్రభాకరరావు, ఎస్పీడీఎస్ కార్యదర్శి కర్రి జోగునాయుడు, శివకుమార్, బీసీటీ కె.శైలజ పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



దిమిలిలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, పోషణ సఖిలు

రాంబిల్లి: పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యపడుతుందని దిమిలి అంగన్‌వాడీ కార్యకర్తలు వరలక్ష్మి, సుజాత అన్నారు. దిమిలిలో గురువారం జాతీయ పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా ర్యాలీ నిర్వహించారు. పోషకాహార ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. విజయవాహిని ఫౌండేషన్ కోఆర్డినేటర్ హారిక మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులు క్రమం తప్పక పోషకాహారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వి.సి.ఎఫ్ కోఆర్డినేటర్ సౌజన్య, టాటా ట్రస్టు పోషణ సఖిలు దుర్గ, పద్మ, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

10న ఉచిత మెగా వైద్య శిబిరం

అచ్యుతాపురం (అనకాపల్లి): అచ్యుతాపురం ఉన్నత పాఠశాలలో ఈ నెల 10వ తేదీన అమ్మా-నాన్న సేవా సంఘం ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. క్యాంప్ నిర్వహించే పాఠశాల ఆవరణలో మౌలిక వసతులను విశాఖ కేర్‌ఆస్పత్రి మేనేజర్ ఆల్ఫా బ్రైట్ గురువారం పరిశీలించారు.